డబుల్ రోడ్డు పూర్తయ్యేదెప్పుడో?

- ఎన్నికలకు ముందు టెండర్లు పూర్తి
- ఇంకా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- గుంతలమయంగా రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు


దహెగాం నుంచి కోత్మీర్ వరకు ఉన్న సింగిల్ రోడ్డు

దహెగాం: ప్రతీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు ఆరు సంవత్సరాల క్రితం సుమారు 35 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. కాగజ్‌నగర్ నుంచి దహెగాం 30 కిలో మీటర్లు ఉండగా.. కేవలం 18 కిలో మీటర్ల వరకు మాత్రమే డబుల్ రోడ్డు వేశారు. మిగతా 12 కిలో మీటర్లు కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డు ఉంది. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు అసెంబ్లీ ఎన్నికలకు ప్రభుత్వం 30 కోట్లు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికలు ముగిసి ఏడు నెలలు అవుతున్నా.. పనులు మాత్రం ముందడుగు పడడం లేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

12 కిలో మీటర్లు నరకం..

మండలంలోని కోత్మీర్ నుంచి కాగజ్‌నగర్ వరకు డబుల్ రోడ్డు ఉండగా.. మిగతా 12 కిలో మీటర్లు కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డు మాత్రమే ఉంది. సింగిల్ రోడ్డు కూడా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. గత పదేళ్లు పాలించిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండలం అభివృద్ధి చెందడం లేదని ప్రజలు వాపోతున్నారు. గుంతలు పడిన రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేయలేదన్నారు.

నిలిచిన ఆర్టీసీ సేవలు..

కాగజ్‌నగర్ నుంచి దహెగాం వరకు వేసవిలో ఆర్టీసీ సేవలను కొనసాగించారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో అందవెల్లి వాగు వద్ద వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ఆర్టీసీ సర్వీస్‌లను రద్దు చేశారు. వంతెన పూర్తయి అప్రోచ్ రోడ్డు వేయడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా ఆర్టీసీ సేవలు మాత్రం ఇంకా పునరుద్ధరించలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డబుల్ రోడ్డు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



దహెగాం నుంచి కాగజ్‌నగర్ నిత్యం ఆటో నడుపుతాను. 30 కిలో మీటర్ల దూరం ఉన్న కాగజ్‌నగర్‌కు పోవాలంటే గంటన్నర సమయం పడుతుంది. దీంతో ఆటో నడపాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాలకు రోడ్డంతా దెబ్బతింది. వెంటనే డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలి.

– పవన్, ఆటో డ్రైవర్

పెంచికల్‌పేట్ మీదుగా వెళ్తున్నాం



దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లాలంటే కోత్మీర్ వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. దీంతో పెంచికల్‌పేట్ మీదుగా వెళ్తున్నాం. అత్యవసర సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికలకు డబుల్ రోడ్డు వేస్తామని చెప్పి ఇంకా పనులు ప్రారంభించ లేదు.

– దేశ్‌ముఖ్ సంజీవ్, ఒడ్డుగూడ

ఓటరు జాబితా తయారు చేయండి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ

కెరమెరి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మి నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో దోమ నివారణకు ఫాగింగ్ చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నా రు.

ఉపాధ్యాయులను కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న గేడం సుభాశ్

తిర్యాణి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతు లవల్ల గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని తుడుందెబ్బ జిల్లా కోఆర్డినేటర్ గేడం సుభాశ్ అన్నా రు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అనేక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక మూతబడి పోయే అవకాశం ఉందన్నారు. ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఎడ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే ప్రాంగణంలో మూడు కళాశాలలో నిర్వహిస్తున్నారని, యూనివర్సిటీ అధికారులు తనిఖీల్లో ఈ విషయం బయటపడిందన్నారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టికనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన రాథోడ్ కిషన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రేహమాన్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం బాధిత కుటుంబానికి రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు జాటోత్ దవీత్ కుమార్, ధరం పాల్, లఖన్, మారుతి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై

ఆసిఫాబాద్: ఇటీవల కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గట్ల సుధాకర్ బుధవారం ఎస్పీ శ్రీనివాసరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు.

కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి: దివంగత గిరిజన శాఖ మంత్రి కోట్నాక్ భీంరావు వర్ధంతి కరపత్రాలను బుధవారం గిరిజన నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గిరిజన హక్కులు, చట్టాల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. వర్ధంతికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, న్యానేశ్వర్, కుసుంబ్ రావు, భరత్, జగనాత్‌రావు, జల్పతిరావు, సోము, పోశేరావు పాల్గొన్నారు.

నేడు సభ్యత్వ నమోదు సమావేశం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో ఎమ్మెల్యే నివాసంలో గురువారం సాయంత్రం 5 గంటలకు బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని జెడ్పీ సీఈవో లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మోడి గ్రామంలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలతో పాటు ఆరోగ్య శుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


కోడిపిల్లలు అందిస్తున్న డీఆర్డీవో దత్తారావు

జైనూర్(ఆసిఫాబాద్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నామని డీఆర్డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బుధవారం కోడిపిల్లలు పంపిణీ చేశారు. మహిళలు మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి


ఆసిఫాబాద్‌అర్బన్: గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సతీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాడడం, లక్కీడ్రాలు నిర్వహించడం, ఇతరులను కించపర్చే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమన్నారు. తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఏదైనా అనుమానస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు.

నిర్మాణ పనులు అడ్డగింత


అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు


పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీలో అటవీశాఖ పరిధిలోని భూమిలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారని బుధవారం ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. ఎల్కపల్లి గ్రామానికి చెందిన పోలోజు రాజమౌళి అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా.. అధికారులు ఇట్టి భూమి అటవీశాఖ పరిధిలో ఉందని, పనులను అడ్డుకున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసిన నిర్మాణ పనులు చేపట్టడంతో అటవీశాఖ అధికారులు సదరు వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఇంటి స్థలానికి మంజూరు చేసిందని, గత 12 సంవత్సరాలుగా ఇంటి పన్ను చెల్లిస్తున్నా అటవీశాఖ అధికారులు భూమి అటవీశాఖ పరిధిలో ఉందని తమని వేధిస్తున్నారని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈసందర్భంగా కుటుంబసభ్యులకు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ సతీశ్

ఆసిఫాబాద్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ సతీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడపొద్దన్నారు. నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చీటింగ్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రతీ ఆటోకి సంబంధించిన ఓనర్ డ్రైవర్ వివరాలు అభయ్ యాప్‌లో పొందుపరచాలని సూచించారు. రాష్ డ్రైవింగ్ చేయకూడదని, ఓవర్ లోడ్‌తో వెళ్లకూడదన్నారు. అపరిచితులు కనబడితే వెంటనే 100కు లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఆటోకు విధిగా ఇన్సూరెన్స్, వ్యక్తిగత ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వర్, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మోవాడ్, బలంపూర్, చింతగూడ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి రక్త వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కీర్తి, నజమస్, సరిత, భీంరావు, ఆశ కార్యకర్త రాధ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని బుధవారం ఉద్యోగ్య ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యుడు ఇందురావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ.. ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సదశివ్, జాదవ్, మిలింద్, రాము, చిరంజీవి, రమేశ్, హేమంత్, హరిప్రసాద్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

బెజ్జూర్: త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురం భీం జిల్లాలో పంచాయతీల వారీగా ఓటర్ జాబితా సవరణ చేపట్టాలని సూచించారు. అలాగే పారిశుధ్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశం, బెజ్జూర్ ఎంపీడీవో గౌరీ శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


రవీంద్రనగర్ పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

చింతలమానెపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. బుధవారం మండలంలోని బాబాపూర్– రవీంద్రనగర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ జ్వరాలు, విషజ్వరాలు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సీతారాం నాయక్, వైద్యులు రాజ్‌కుమార్‌లను వివరాలు అడిగారు.

అమ్మ ఆదర్శ పాఠశాల తనిఖీ..

మండలంలోని బాబాపూర్ గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు గదిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలన్నారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో గోవర్ధన్ సింగ్, మక్బూల్ పాల్గొన్నారు.

కౌటాల: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. బుధవారం కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, గదులను పరిశీలించారు. రోజు ఎంత మంది రోగులు వస్తున్నారు? మందుల కొరత ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. డెలవరీలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంను ఆదేశించారు.

'అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి'


మాట్లాడుతున్న సుధాకర్‌రావు

బెజ్జూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం పీఏసీఎస్ ఎదుట ధర్నా చేయనున్నట్లు, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల నాయకులు వసీ ఖాన్, దిగంబర్, రమేశ్, తాళ్ల రామయ్య, సత్యనారాయణ, మోహన్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

తిర్యాణి: మండలంలోని గుండాల జలపాతం వద్ద ఏకో టూరిజం కమిటీ ఏర్పాటు అయింది. ఈ సందర్భంగా పర్యాటకులు వచ్చే దారిలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు రెంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మద్యం తీసుకొని వచ్చే పర్యాటకులను జలపాతం వద్దకు అనుమతించమని పేర్కొన్నారు.

మండల వ్యవసాయాధికారికి సన్మానం


ఏవో రాజేశ్‌ను సన్మానిస్తున్న డీలర్లు, స్థానికులు

కౌటాల: మండల ఫర్టిలైజర్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక జగదాంబ గార్డెన్‌లో మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఏవో మాట్లాడుతూ 12 ఏళ్లపాటు కౌటాల, చింతలమానెపల్లి మండలాల రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ వారి అభివృద్ధిలో సహకరిగా ఉన్నానని తెలిపారు. డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు బొమ్మకంటి మహేశ్ మాట్లాడుతూ ఏవో రాజేశ్ సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు వొజ్జల వెంకన్న, అకంరావు, దేవయ్య, తిరుపతి, లహాను, నీలేశ్, సత్తనారాయణ, శ్రావణ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లోకి జెడ్పీటీసీ పంద్రం పుష్పలత

బెజ్జూర్: బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత తన అనుచరులతో కలిసి బుధవారం సోమిని గ్రామంలో ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీకి రాఖీ కట్టారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ సోమిని నుంచి కృష్ణపెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు రూ.5లక్షల మరమ్మతు పనులను ప్రారంభించారు. అర్షద్ హుస్సేన్, నాన్నయ్య, విశ్వనాథ్, శ్రీవర్ధన్, రాజన్న, సురేశ్‌గౌడ్, నహీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 2024– 25 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ దత్తాత్రేయ తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫీజులు సైతం ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు.

భీంరావు రాజకీయ జీవితం ఆదర్శప్రాయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి రాష్ట్రంలోని మొదటి గిరిజన శాఖ మంత్రిగా పని చేసిన కోట్నాక భీంరావు రాజకీయ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిడా సూరు అన్నారు. ఈ నెల 29న భీంరావు వర్ధంతి నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాయిసెంటర్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు కిషన్‌రావు, మారుతి, అర్జున్, జ్ఞానేశ్వర్, చందన్‌షా పాల్గొన్నారు.

ఖైరీట్ గ్రామంలో డ్రై డే

వాంకిడి: మండలంలోని ఖైరీట్ గ్రామంలో బుధవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. మలేరియా, డెంగ్యు, టైఫాయిడ్, డయోరియా, చికెన్‌గున్య వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్లల్లో, పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. పలువురి నుంచి రక్తనమూనాలు తీసుకున్నారు. హెచ్‌ఈవో రవిదాస్, పీహెచ్ఎన్ క్రిస్టియానా, హెచ్ఎస్ అనుసూయ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు


నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు బుధవారం పట్టణంలో ఏఐడబ్ల్యూయూ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. 2000 ఆగస్టు 28న పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించమని ఉద్యమించడంతో బుల్లెట్ల వర్షం కురిపించారని, ఈఉద్యమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలు మృతి చెందారని జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.